సాక్షి
వికారాబాద్
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



దళితబంధు మాకేదీ?

దళిత బంధు సాయం అందడం లేదంటూ దోమ మండలం దాదాపూర్‌కు చెందిన దళితులు రోడ్డెకి నిరసన తెలిపారు. 8లో▸



కోరిక తీర్చలేదని..

కోరిక తీర్చలేదని ఓ మహిళను హత్యచేసి ఫామ్‌హౌస్‌లో పాతిపెట్టిన కేసును చేవెళ్ల పోలీసులు ఛేదించారు. 8లో▸



మీసేవకు మోక్షమెప్పుడో!

తాండూరు మండలం మల్కాపూర్‌లో రూ.7 లక్షలతో నిర్మించిన మీ సేవ కేంద్ర భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

మట్టి గణపతులనే పూజిద్దాం

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్

వికారాబాద్ అర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులనే పూజిద్దామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని తెలిపారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తే ఎలాంటి ముప్పు ఉండదన్నారు. అంతేకాకుండా కుమ్మరులను వృత్తి పరంగా ప్రోత్సహించినట్లు అవుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు మట్టి గణపతులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. మట్టి విగ్రహాలు కావాల్సిన వారు వికారాబాద్‌కు చెందిన కుమ్మరి అంజయ్య సెల్ నం. 9966466982ను, పరిగి ప్రాంతానికి చెందిన కుమ్మరి గౌరీ శంకర్ సెల్ నం. 9676038986ను, తాండూరు ప్రాంతానికి చెందిన కుమ్మరి శ్రీశైలం సెల్ నం. 9640518846ను, కుమ్మరి రాఘవేందర్ సెల్ నం. 9985171490ను, కొడంగల్ ప్రాంతానికి చెందిన కుమ్మరి అంజిలయ్య సెల్ నంబర్ 9391645200లో సంప్రదించాలని సూచించారు.

టెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

వికారాబాద్ అర్బన్: ఈ నెల 15న నిర్వహించనున్న టెట్ - 2023 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో రేణుకాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పేపర్ -1 పరీక్షకు 5,765 మంది, పేపర్ -2కు 3,846 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటలలోపు పరీక్ష కేంద్రాల్లో వెళ్లాలని, మధ్యాహ్నం పరీక్షకు 2:30గంటలోపు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతించరని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎల్రక్టానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే డీఈవో కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్ 08416254964కు కాల్ చేయాలని సూచించారు.

నూతన కమిటీ ఏర్పాటు



స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. పాలకవర్గంలో 19 మంది సభ్యులకు అవకాశం కల్పించారు. చైర్‌పర్సన్‌గా గడ్డె వీణ, వైస్ చైర్మన్‌గా పటేల్ ఉమాశంకర్, సభ్యులుగా హరిహరగౌడ్, షేక్ ఖాసీం, ప్రకాశం, బీరప్ప, గోపాల్‌రెడ్డి, మహమ్మద్ ముస్తాఫా, గోవింద్ నాయక్, వెంకటప్ప, వెంకటయ్య, శ్రీనివాస్, భానుప్రసాద్, ప్రశాంత్‌గౌడ్, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, వ్యవసాయ శాఖ ఏడీ, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కమిటీలో నియమించారు.

గొర్రెల పథకంలో గోల్‌మాల్!

గొల్లకురమలు ఆర్థిక పరిపుష్టి సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం అక్రమార్కులు, దళారులకు వరంగా మారింది. జీవాల పెంపకంతో ఉపాధి పొందాలనే ఉద్దేశంతో.. లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న యూనిట్లు తెల్లారేసరికే మాయమవుతున్నాయి. ఒక గ్రామంలో పంపిణీ ప్రక్రియ ముగియగానే.. జీవాలను గంపగుత్తగా కొనుగోలు చేస్తున్న దళారులు మరో గ్రామానికి తీసుకెళ్లి పథకం లబ్ధిదారులకు అంటగడుతున్నారు.

- గ్రామాల్లో అట్టహాసంగా జీవాల పంపిణీ
- మరుసటి రోజే దళారులకు విక్రయం
- లబ్ధిదారుల నిస్సహాయతను సొమ్ము చేసుకుంటున్న వైనం
- కొంతమంది అధికారులు, నాయకుల అండదండలతో రీసైక్లింగ్
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



ఇటీవల దౌల్తాబాద్ మండలంలో లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ పథకం మండలంలో విఫలమవుతోంది. ఒక పక్క గొర్రెల పంపిణీ, ఆ వెంటనే వాటి విక్రయం చకచకా జరిగిపోతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నిరుగారుతోంది. ఒక్కో యూనిట్ ధర రూ. 1.75లక్షలు కాగా ప్రభుత్వం తన వాటా కింద రూ. 1,31,250 చెల్లించనుంది. లబ్ధిదారుడు తన వాటా కింద రూ. 43,750 చెల్లించాల్సి ఉంటుంది. పథకం మంజూరైన లబ్ధిదారుడికి 20 గొర్రెలు, ఒక పొట్టేలు కొనుగోలుకు రూ. 1.50లక్షలు మంజూరు చేస్తారు. మిగిలిన రూ. 25వేలతో గొర్రెల మంద తరలింపు, ఇన్సూరెన్స్ కట్టాల్సి ఉంటుంది. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 560 మంది లబ్ధిదారులు తమ వాటా మొత్తం రూ. 2,43,60,000 డీడీ రూపంలో చెల్లించారు. ఏడాది తర్వాత ప్రస్తుత జూలైలో గొర్రెల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది.

విధి విధానాలు ఇవే..

మొదటి విడత గొర్రెల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం విధివిధానాలను కఠినతరం చేసింది. గొర్రెల ఎంపికలో మండల పశువైద్యాధికారుల పాత్రను తగ్గించి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించింది. జిల్లా పశువైద్యాధికారి పర్యవేక్షణలో జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులను ఒక టీంగా ఏర్పాటు చేసింది. ఈ బృందం లబ్ధిదారులతో కలసి వెళ్లి గొర్రెల కొనుగోలును పర్యవేక్షించాలి. లబ్ధిదారులు తమ ఇష్టపూర్వకంగా గొర్రెలను ఎంపిక చేసుకున్నట్లు వాయిస్ రికార్డు చేసి దాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా నిబంధనలు విధించారు.

ఉదయం పంపిణీ.. రాత్రికి మాయం

మండలంలోని దౌల్తాబాద్‌కు ఒక యూనిట్, గుముడల గ్రామానికి 13, తిమ్మారెడ్డిపల్లికి 4 యూనిట్లు మంజూరయ్యాయి. వారం రోజుల క్రితం అధికారులు, లబ్ధిదారులు ఏపీలోని కర్నూల్ జిల్లాలో గొర్రెలను కొనుగోలు చేశారు. వాటిని ఆయా గ్రామాల్లో జెడ్పీటీసీ, ఎంపీపీల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ ముగిసిన గంటల్లోనే దళారులు వచ్చి గొర్రెలను కొనుగోలు చేసి తీసుకెళ్లిపోయారు. ఈ విషయమై లబ్ధిదారులను వివరణ కోరగా ఏడాదిన్నర క్రితం అప్పులు చేసి డీడీలు కట్టామని, సకాలంలో యూనిట్లు మంజూరు చేయకపోవడం వల్ల వడ్డీ పెరిగిపోయిందని, తీర్చాల్సి రావడంతో గొర్రెలను విక్రయించినట్లు తెలిపారు.

కట్టింది రూ.43 వేలు.. అమ్మింది రూ. 85వేలకు

లబ్ధిదారులు గొర్రెలను ఎంపిక చేసుకున్న తరువాత అధికారులు జీపీఎస్ ట్యాగ్ ఉన్న వాహనాల్లో ఆరు యూనిట్లను లబ్ధిదారుల గ్రామాలకు తరలించారు. అక్కడ సర్పంచ్, గొల్లకురుమ కమిటీ అధ్యక్షుడు, లబ్ధిదారుడు, స్థానిక పశువైద్యాధికారి సమక్షంలో వాహన, గొర్రెల ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన రెండు రోజుల తరువాత గొర్రెలు విక్రయించిన వ్యక్తి బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వం డబ్బు జమ చేస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు కథ ఇక్కడే ప్రారంభమవుతుంది. ఫొటోలు తీసుకున్న వెంటనే దళారులు ఆయా గ్రామాలకు చేరుకుని బేరానికి దిగుతున్నారు. ఒక్కో యూనిట్‌ను రూ. 85వేల నుంచి రూ.1.10 లక్షల వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. అధికారులు, నాయకుల అండదండలతోనే ఇదంతా జరుగుతున్నట్లు సమాచారం.

ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు

గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు చోటుచేసుకుంటే ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. పోలీసు కేసు నమోదు చేస్తాం. లబ్ధిదారులు గొర్రెలు విక్రయించినట్లు తమకు సమాచారం వస్తే వెంటనే విచారణ జరిపిస్తాం. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

– అనిల్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి



చన్గోముల్ గ్రామంలో మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

కేసీఆర్ మహిళా పక్షపాతి

- వారి సంక్షేమం కోసం అనేక పథకాల అమలు చేస్తున్నారు
- మంత్రి మహేందర్‌రెడ్డి
- చన్గోముల్ గ్రామంలో మహిళా ఆరోగ్య కేంద్రం ప్రారంభం

పూడూరు: సీఎం కేసీఆర్ మహిళా పక్షపాతి అని, వారి సంక్షేమం కోసం ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పూడూరు మండలం చన్గోముల్ గ్రామంలో మహిళా ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతి మండలంలో ప్రత్యేక ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 372 మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తున్నట్లు వివరించారు. మగశిశువు పుడితే నాలుగు విడతలుగా రూ. 12వేలు, ఆడ శిశువు పుడితే రూ. 13వేలు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 43 వేల మంది బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేసినట్లు తెలిపారు. మహిళా ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాల్వాన్‌కుమార్, జెడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ మల్లేశం, ఎంపీటీసీ శ్యామల, సర్పంచ్ మల్లిక, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రహీస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు - రంగారెడ్డితో సస్యశ్యామలం

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుతో మన ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ నెల 16న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా జరిగే పాలమూరు ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. 17న కృష్ణానది జలాలను తెచ్చి జిల్లాలోని అన్ని గ్రామ దేవతల పాదాలు కడగాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అరవింద్‌శర్మ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి

- డీఆర్‌డీఓ కృష్ణన్
- ఉపాధి హామీ అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కృష్ణన్

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కృష్ణన్ సూచించారు. మంగళవారం మండలంలోని అంతారం రైతు వేదికలో నాలుగు మండలాల ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. హరితహారంపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాలకు ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి కూలీల జాబ్ కార్డుకు ఆధార్ నంబరు అనుసంధానం చేయాలని ఆదేశించారు. శ్మశానవాటికలు, డంపింగ్ యార్డ్‌లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల పురోగతితో పాటు వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. రుణాలు ఇవ్వడంలో అలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ స్టిఫెన్ నీల్, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఏపీఓ నరోత్తంరెడ్డి, ఏపీఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- గుల్బర్గా సౌత్ ఎమ్మెల్యే అల్లం ప్రభు
- విజయభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపు



తాండూరు టౌన్ సమావేశంలో మాట్లాడుతున్న అల్లం ప్రభు

పరిగి: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా సౌత్ ఎమ్మెల్యే, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్ అల్లం ప్రభు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీఆర్ఆర్ నివాసంలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసేందుకే జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో పరిగి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి జరిగిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో పరిగి నియోజకవర్గానికి 42వేల ఇళ్లు కేటాయించామని గుర్తు చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత మందికి ఇళ్లు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, నిరుపేదలందరికీ ఇల్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఈ సభకు సోనియగాంధీ హాజరై ఐదు గ్యారెంటీ పథకాల కార్డుని ఆవిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారధి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, పలు మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, అశోక్, సురేందర్ ముదిరాజ్, చిన్న నర్సింహులు, జగన్, రామకృష్ణారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభను సక్సెస్ చేయండి

తాండూరు టౌన్: ఈ నెల 17న తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ పార్టీ మహాసభను విజయవంతం చేయాలని దక్షిణ గుల్బర్గా ఎమ్మెల్యే అల్లం ప్రభుపాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం తాండూరు కాంగ్రెస్ భవన్‌లో జరిగిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో గొప్ప విజయాన్ని సాధించామన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలిచే సత్తా కాంగ్రెస్‌కు ఉందన్నారు. తాండూరు కాంగ్రెస్‌కు కంచుకోట అని, ఏళ్ల తరబడిగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇక్కడ పాలించారన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 10లక్షల మందితో మహాసభను విజయవంతం చేస్తామని తెలిపారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, తాండూరు పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాలా, నాయకులు బస్వరాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు హుష్‌కాకి !

- అడ్డదారుల్లో బదిలీలకు ప్రయత్నిస్తున్న ఉపాధ్యాయులు
- ఇప్పటి వరకు 11మందిని గుర్తించిన విద్యాశాఖ
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్న డీఈఓ
- జిల్లాలో 4,030 మంది ఉపాధ్యాయులు
- తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు 1,370
- దరఖాస్తు చేసుకున్న వారు 3,167



వికారాబాద్: ఉపాధ్యాయుల బదిలీలలో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. బదిలీలు, పదోన్నతులు ఎప్పుడు జరిగినా.. వివాదాలకు కేంద్రబిందువులుగా మారే టీచర్లు ఈ సారి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. కొంత మంది టీచర్లు అడ్డదారులు తొక్కుతూ తోటి ఉపాధ్యాయులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే డీఈఓకు ఫిర్యాదులు అందాయి. అక్రమ మార్గాల ద్వారా బదిలీల కోసం ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకుంటామని డీఈఓ ప్రకటించారు. ఆ హెచ్చరికలు మాకు కాదులే అన్నట్లు కొంతమంది ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నారు.

బదిలీ కావాల్సిన ఉపాధ్యాయులు 1,370

గత ఫిబ్రవరిలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభించగా స్పౌజ్‌కు ఇచ్చిన పాయింట్ల విషయంలో కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాజాగా కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించింది. సెప్టెంబర్ ఒకటిని కటాఫ్ తేదీగా పరిగణించి బదిలీలు, పదోన్నతులు చేపడుతోంది. ఇప్పటికే ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, గెజిటెడ్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు కలిపి 4,868 పోస్టులు ఉండగా, ఇందులో 4,030 మంది విధులు నిర్వహిస్తున్నారు. మరో 832 పోస్టులు ఖాళీగా ఉన్నారు. ఎస్జీటీ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, స్కూల్ అసిసెంట్లకు ఎనిమిది సంవత్సరాలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఐదు సంవత్సరాల లాంగ్ స్టాండింగ్ పీరియడ్‌గా తీసుకుంటున్నారు. ఈ లెక్కన జిల్లాలో 1,370 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ఇందులో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని కలుపుకుని మొత్తం 3,167 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,064 దరఖాస్తులు అప్రూవల్ చేశారు. వివిధ కారణాలతో 103 మంది దరఖాస్తులను తిరస్కరించారు. గ్రీవియెన్స్ కింద మరో 282 దరఖాస్తులు రాగా ఇందులో ఇప్పటి వరకు 198 అర్జీలను అప్రూవల్ చేశారు.

అర్హత లేకున్నా..

బదిలీ ఆప్షన్ వర్తించాలంటే ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొని ఉండాలి. అయితే 317 జీఓలో భాగంగా పలువురు పక్క జిల్లాలకు బదిలీపై వెళ్లి.. మ్యూచువల్ పద్ధతిన తిరిగి జిల్లాకు వచ్చారు. వారు వచ్చి ఏడాది కూడా పూర్తి కాలేదు. వీరు బదిలీలకు అనర్హులు. అయితే జిల్లాలో పాత సర్వీసును కలుపుకుని వెబ్ ఆప్షన్‌లో చూపిస్తున్నారు. దీంతో అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం లేకపోలేదు. ఇలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు డీఈఓను కోరుతున్నారు. ఇప్పటి వరకు అక్రమ మార్గాల ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 11 మందిని జిల్లా విద్యా శాఖ గుర్తించింది. ఇంకా చాలా మందే ఉన్నారని ఉపాధ్యాయులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



కొంతమంది ఉపాధ్యాయులు ఎక్కువ సర్వీస్ చూపిస్తూ వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న మాట వాస్తవమే. వారు దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను క్రాస్ చెక్ చేస్తున్నాం. నిబంధనలు పాటించని వారి అర్జీలు తిరస్కరిస్తున్నాం. అక్రమ పద్ధతులు పటించినట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– రేణుకాదేవి, డీఈఓ

ఉన్నత స్థానంలో నిలవాలి



తీజ్ ఉత్సవాల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- గిరిజన మహిళలకు కలెక్టర్ సూచన
- ముగిసిన తీజ్ ఉత్సవాలు

వికారాబాద్ అర్బన్: గిరిజన మహిళలు బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో బంజారా తీజ్ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన మహిళలు కష్టపడి చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. సమాజానికి సేవలు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బంజారాల సంక్షేమానికి కృషి చేయాలని డీటీవో కోటాజికి కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్‌ను సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బంజారా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవ నాయక్, ధారూర్ వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



రుక్మిణిని సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రుక్మిణికి కలెక్టర్ అభినందనలు

అనంతగిరి: ఖోఖో అంతర్జాతీయ జట్టులో వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని రుక్మిణికి చోటు దక్కింది. భారత జట్టులో తెలంగాణ నుంచి రుక్మిణికి చోటు లభించడంతో మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ రమణమ్మ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నాటిన ప్రతీ మొక్క బతకాలి

డీఆర్‌డీఓ పీడీ కృష్ణ



మొక్కలను పరిశీలిస్తున్న పీడీ కృష్ణ

పెద్దేముల్: ప్రధాన రహదారుల పక్కన పెద్ద ఎత్తున్న మొక్కలు నాటాలని డీఆర్‌డీఓ పీడీ కృష్ణ అన్నారు. పెద్దేముల్ మండల చైతన్యగనర్ వద్ద రోడ్డు పక్కన నాటిన మొక్కలను మంగళవారం ఆయన పరిశీలించారు. పది రోజుల్లో రోడ్ల పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఎంపీడీఓ లక్ష్మప్పను ఆదేశించారు. మన్‌సాన్‌పల్లి నుంచి కందనెల్లి వరకు రోడ్డు పక్కన సుమారు 4వేల మొక్కలు నాటుతామన్నారు. వన నర్సరీలో మొక్కలు అందుబాటులో లేకుంటే గ్రామ పంచాయతీ గ్రీన్ నిధుల నుంచి మొక్కలను ఖరీదు చేసి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గుంతలు తవ్వి మొక్కలు నాటాలన్నారు. ప్రతిమొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మప్ప, ఉపాధి హమీ ఈసీ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు అంజిలయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి

తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పెద్దేముల్: రబీలో రైతులు అధిక కాలపరిమితి కలిగి ఉండే కందులు సాగుచేసుకోవాలని తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అంబురామేశ్వర ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాండూరు కందికి భౌగోళిక గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీఓ).. రైతులకు ఏలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తాండూరు ఏడీఏ రుద్రమూర్తి, ఏఓ నజీరుద్దీన్, ఏకలవ్య కార్యదర్శి బాలకృష్ణ, వికారాబాద్ జిల్లా ఎఫ్‌పీసీల కోఆర్డినేటర్ చంద్రకాంత్‌రెడ్డి, ఏఈఓ స్వాతి, అంబురామేశ్వర ఫౌండేషన్ చైర్మన్ తుల్జప్ప, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ అశోక్, డైరక్టర్‌లు చంద్రశేఖర్, ఉదయకుమార్, బిచ్చన్న, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపిక



జంగయ్య(సర్పంచ్)



సురేష్ (కార్యదర్శి)

పరిగి: రాష్ట్రస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డులకు పరిగి మండలం రాఘవపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంగయ్య, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఎంపికయ్యారు. వీరికి ఈనెల 14న నగరంలో జరిగే పురస్కార కార్యక్రమంలో అవార్డు అందించడంతో పాటు ప్రశంసాపత్రాలను అందించనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రాఘవపూర్ గ్రామపంచాయతీని జాతీయస్థాయి ఎంపిక పరిశీలనకు పంపించడం జరిగిందని అధికారులు తెలిపారు.

దళితబంధు మాకేదీ?

- దాదాపూర్‌లో దళితుల ఆందోళన
- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం
- అధికార పార్టీ నేతలకే ఇస్తున్నారంటూ ఆగ్రహం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళితులు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెడితే కొందరు అధికార పార్టీ నేతలు వారికి అనుకూలంగా ఉన్న దళితులకు మాత్రమే దళితబంధు సహాయాన్ని కేటాయిస్తోందంటూ పలువురు దళితులు మండిపడుతున్నారు. దోమ మండల పరిధిలోని దాదాపూర్‌లో తమకు దళితబంధు సహాయం అందలేదని మంగళవారం ఆ గ్రామ దళితులు మాకేది రోడ్డెక్కారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

అధికార పార్టీ నేతలకేనా..

మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ ఏ గ్రామంలో సక్రమంగా దళితబంధును కేటాయించడం లేదని ఆయా గ్రామాల దళితులు వాపోతున్నారు. ఇప్పటికే మంజూరైన దళితబంధులో అధికార పార్టీ నేతలతో పాటు ప్రజాప్రతినిధులు తీసుకున్నారని.. ప్రస్తుతం తమకు కేటాయించమని కోరితే కొందరు నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దళితులపై క్షక్ష్య సాధింపులో భాగంగానే అధికార పార్టీ కార్యకర్తలకే దళితబంధును కేటాయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ ఇవ్వాలి..

ప్రతీ గ్రామంలో అర్హులందరికీ దళితబంధు సహాయాన్ని అందించాలని ఆయా గ్రామాల దళితులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులే దళితబంధును తీసుకుంటే.. పేద, మధ్య తరగతి దళితుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అధికారులు ఆలోచించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పేద దళితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

దళితబంధు ఇవ్వడం లేదు



నేను ఒక వికలాంగుడిని. దళిత కుటుంబంలో జన్మించాను. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధును కేటాయించాలని స్థానిక నేతలను కోరితే.. ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి నాకు దళితబంధు సహాయం అందేలా చూడాలని కోరుతన్నా.

– వెంకటేశ్, దాదాపూర్

అర్హులందరికీ ఇవ్వాలి



దళితబంధు సహాయాన్ని కేటాయించడంలో అధికారులు, నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో అర్హులను గుర్తించకుండా అధికార పార్టీ నేతలకే దళితబంధును కేటాయిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అర్హులందరికీ దళితబంధును కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, దోమ

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

- ధారూరులో మహిళా క్లినిక్ ప్రారంభం
- స్త్రీశక్తి భవన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ధారూరు: మహిళలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా క్లినిక్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ అనగానే మత్యువు ఒడిలోకి చేరినట్లే అని భావిస్తారని, అది నిజం కాదన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ఆపరేషన్ చేస్తే నయమవుతుందన్నారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌లో డాక్టర్ నుంచి సిబ్బంది వరకు అందరూ మహిళలే ఉంటారని.. స్త్రీలు నిర్భయంగా తమ సమస్యలను చెప్పి చికిత్స పొందాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ధారూరు మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్లన్లు సంతోష్, అంజయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, సర్పంచ్ చంద్రమౌలి, ఎంఐఎం నేతలు, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

నెరవేరిన కల

- బషీరాబాద్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల
- జీఓ జారీ చేసిన ప్రభుత్వ కార్యదర్శి కరుణ వాకాటి

బషీరాబాద్: బషీరాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కరుణవాకాటి జీఓ నంబర్ 72ను జారీ చేశారు. బషీరాబాద్‌లో కళాశాల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.34కోట్లు, మౌలిక సదుపాయాల కోసం రూ.4.79కోట్ల నిధులను 2023–24 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేసింది. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సొంత మండలమైన బషీరాబాద్‌లో ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేదు. దీంతో బషీరాబాద్ మండలానికి చెందిన విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసించేందుకు తాండూరు పట్టణానికి రావాల్సి వచ్చేది. దీంతో మండలంలో ప్రతీ ఏటా పదో తరగతి పూర్తిచేసే 450- 550 మంది విద్యార్థులు అవస్థలు పడేవారు. ఇంటర్ విద్యకోసం తాండూరుకు వెళ్లలేక మెజార్టీ విద్యార్థులు పదోతరగతితోనే చదువును ఆపేసేవారు. బాలికల ఉన్నత విద్య శాతం పూర్తిగా పడిపోయింది. గతంలో ఎంతోమంది నేతలు బషీరాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీలకే పరిమితం అయ్యారు. అయితే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాత్రం ప్రత్యేక చొరవ తీసుకుని బషీరాబాద్‌కు కళాశాల తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు.

నగదు, మద్యం రవాణాను అరికడదాం

కల్బుర్గి పోలీసులతో ఎస్పీ కోటిరెడ్డి సమీక్ష



కర్నాటక రాష్ట్రం కల్బుర్గి పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు: తెలంగాణ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక రాష్ట్రం నుంచి నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు కల్బుర్గి (గుల్బర్గా) జిల్లా పోలీసులు ముందుకు రావడం అభినందనీయమని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. తెలంగాణ–కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న వికారాబాద్ జిల్లా–కల్బుర్గి జిల్లా పోలీసు అధికారుల సమీక్షా సమావేశాన్ని మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని చించోళి సబ్ డివిజన్ కార్యాలయంలో చేపట్టారు. ఈ సమావేశానికి ఎస్పీ కోటిరెడ్డితో పాటు, కల్బుర్గి జిల్లా రూరల్ ఎస్పీ శ్రీనివాస్, పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలపై వారు చర్చించారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా పరిధిలో 5 పోలీస్ స్టేషన్లు సరిహద్దు ప్రాంతాలు కలిగి ఉన్నాయని అన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల సరిహద్దు ప్రాంతాల్లో కర్నాటక సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు కల్బుర్గి జిల్లా ఎస్పీ శ్రీనివాస్ అంగీకారం తెలిపారన్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల మధ్య 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, చించోళి డీఎస్పీ బస్వరాజ్, తాండూరు రూరల్ సీఐ రాంబాబు, కొడంగల్ సీఐ రాములు, సీఐలు, ఎస్ఐలు, కర్నాటక పోలీసులు పాల్గొన్నారు.

కోరిక తీర్చలేదని కొట్టి చంపాడు

- ఫామ్‌హౌస్‌లో మహిళ శవం కేసును ఛేదించిన పోలీసులు
- వాచ్‌మన్, అతడి భార్య అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- మృతురాలిది వికారాబాద్ జిల్లా మద్గుల్ చిట్టెంపల్లి
- వివరాలు వెల్లడించిన చేవెళ్ల సీఐ



వివరాలను వెల్లడిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: మహిళను హత్యచేసి పామ్‌హౌస్‌లో పాతిపెట్టిన కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం చేవెళ్ల పీఎస్‌లో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ వీరబ్రహ్మం వెల్లడించారు. స్థానికుడైన కనకమామిడి మల్లారెడ్డికి చెందిన చేవెళ్లలోని ఫామ్‌హౌస్‌లో గుర్తు తెలియని మహిళను చంపి, పాతిపెట్టినట్లు ఈ నెల 10న వెలుగు చూసిన ఘటన కలకలం రేపింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు వివరాలు సేకరించారు. అనంతరం కేసు దర్యాప్తు చేపట్టగా.. హతురాలు వికారాబాద్ జిల్లా మద్గుల్ చిట్టెంపల్లి గ్రామానికి చెందిన కాశ మైసమ్మ అలియాస్ శివనీల (28)గా గుర్తించారు.

ఏం జరిగిందంటే..

మృతురాలు పది రోజుల కిత్రం చేవెళ్లకు వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు సంపత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇతను ఐదేళ్లుగా పట్టణంలోనే ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఒంటరిగా ఉంటున్న సంపత్, శివనీల భార్యాభర్తల్లా కలిసి ఉంటూ, పనిచేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఇదే విషయమై ఈనెల 7న మొయినాబాద్‌లోని కల్లు దుకాణంలో కూర్చుని మాట్లాడుకుంటుండగా.. చేవెళ్లలోని ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్ సత్తయ్య, ఇతని భార్య కల్పన కల్లు తాగుతూ.. వీరితో మాటలు కలిపారు. పరస్పర పరిచయాలు పూర్తయిన తర్వాత తాము పని చేస్తున్న ఫామ్‌హౌస్‌లోనే మీకు కూడా పని ఇప్పిస్తామని సత్తయ్య దంపతులు చెప్పారు. ఇందుకు సంపత్, శివనీల సరే అనడంతో నలుగురూ కలిసి చేవెళ్లలోని ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు.

హత్యకు దారితీసిన దురాలోచన

నలుగురూ కలిసి సాయంత్రం వరకూ బాగా మద్యం తాగారు. అంతకు ముందే కల్లు తాగి ఉండటంతో సత్తయ్య భార్య కల్పన నిద్రలోకి జారుకుంది. మిగిలిన ముగ్గురు కలిసి ఉండగా సత్తయ్య మనసులో దురాలోచన మెదిలింది. శివనీలను అనుభవించాలని భావించిన అతడు.. సంపత్‌కు రూ.500 ఇచ్చి మద్యం తీసుకురమ్మని పంపించాడు. అనంతరం శివనీల ఒంటరిగా ఉండటంతో తన కోరిక తీర్చాలని అడిగాడు. కానీ శివనీల మాత్రం అందుకు ఒప్పుకోలేదు. ఎంత బలవంతం చేసినా ససేమిరా అనడంతో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో బాధితురాలు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. సత్తయ్య కర్ర తీసుకుని ఆమె తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన శివనీల గట్టిగా అరిచింది. దీంతో ఎక్కడ తన భార్య నిద్ర లేస్తుందోనని భావించి మరోసారి కర్రతో తలపై బాదాడు. అనంతరం ఓ వస్త్రాన్ని మెడకు బిగించి హత్యచేశాడు.

పుస్తెలతాడు చోరీ..

మద్యం తీసుకుని వస్తున్న సంపత్‌కు ఎదురెళ్లిన సత్తయ్య.. శివనీల తనతో గొడవ పెట్టుకుని వెళ్లిపోయిందని, నీకు కూడా ఇక్కడ పని లేదని చెప్పి పంపించేశాడు. తిరిగివచ్చిన అనంతరం శివనీల మెడలోని బంగారు పుస్తెల తాడును తీసుకుని, ఫామ్‌హౌస్ పక్కనున్న బండలను తొలగించి శవాన్ని పాతిపెట్టాడు. ఎప్పటిలాగే పైన బండలు కప్పేశాడు. మరుసటి రోజు ఉదయాన్నే నిద్రలేచిన కల్పన.. సంతప్, శివనీల వివరాలను ఆరా తీయగా.. రాత్రే వెళ్లిపోయారని చెప్పాడు. కానీ ఫామ్‌హౌస్ పక్కన గొయ్యి తవ్వినట్లు, బండలు తొలగించినట్లు ఆనవాళ్లను గుర్తించి నిలదీయగా.. అసలు విషయం బయటపెట్టాడు.

అన్నీ సర్దుకుని..

ఇక్కడే ఉంటే పోలీసులు పట్టుకుంటారని భయపడిన కల్పన, సత్తయ్య.. ఈ నెల 8న పామ్‌హౌస్ యజమానికి ఫోన్ చేశారు. తమ స్వగ్రామమైన మైలార్‌దేవరపల్లిలో గొడవలు జరుగుతున్నాయని, ఇంటికి వెళ్లాల్సి ఉందని చెప్పారు. అప్పటికే పలుమార్లు వీరితో ఇబ్బంది పడిన ఆయన ఇక మీరు రానవసరం లేదు వెళ్లిపోండి అన్నారు. ఇదే అదనుగా సామాన్లు సర్దుకుని వెళ్లిపోయారు. శివనీల మెడలో నుంచి దొంగిలించిన పుస్తెల తాడు తన భార్యదిగా చెప్పి.. ఓ బంగారం దుకాణంలో తాకట్టు పెట్టి రూ.5 వేలు తీసుకున్నారు.

విషయం పొక్కిందిలా..

మల్లారెడ్డి తన స్నేహితుడు, డ్రైవర్ కలిసి 10న ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. పైపులైన్ పనిచేయటం లేదని వెళ్లి పరిశీలిస్తూ బండల కింద తవ్వారు. మహిళ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. యాజమాని ఫిర్యాదుతో సత్తయ్య, కల్పనను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకొన్నారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పుస్తెలతాడును తాకట్టు పెట్టిన రశీదు, హత్యకు ఉపయోగించిన కర్ర, గడ్డపార, పారలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. లైంగికదాడులు, చోరీలకు పాల్పడేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌పై ఆరోపణలను ఖండిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ట్రెసా సభ్యులు

ట్రెసా రాష్ట్ర కార్యదర్శులు మనోహర్ చక్రవర్తి, అమరేంద్ర కృష్ణ

వికారాబాద్ అర్బన్: జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ట్రెసా రాష్ట్ర కార్యదర్శులు మనోహర్ చక్రవర్తి, అమరేంద్ర కృష్ణ తెలిపారు. మంగళవారం జిల్లా ట్రెసా సభ్యులు కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని రోజులుగా దినపత్రికలో ప్రచురితమవుతున్న పరిగి మండలం రాఘవాపూర్ గ్రామ పరిధిలోగల సర్వే నంబర్లు 95, 96లోగల 22 ఎకరాల రెండు గుంటల భూమి సీలింగ్ భూములని, వాటిని అక్రమంగా సీఓబీ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ చేశారని వస్తున్న ఆరోపణలు సరైనవి కావన్నారు. ఇట్టి భూములకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా పరిశీలించిన తర్వాతనే ధరణి పీఓబీ నుంచి తొలగించడం జరిగిందని.. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి పట్టాదారులు, కొనుగోలుదారులు స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, దీనిపై ఎలాంటి అగ్రిమెంట్ జరిగినా ఎటువంటి ఆక్షేపణలు, విభేదాలు ఉన్నా సివిల్ కోర్టు ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని వారు సూచించారు. ఈ విషయంపై కొందరు నిజానిజాలు తెలుసుకోకుండా అధికారులపై నిరాధారమైన ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా చేస్తున్నారని ఇట్టి విషయాన్ని ట్రెసా సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ తాము న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. ట్రెసా సభ్యులు విజయేందర్, తారా సింగ్, విజయ్కుమార్, పురుషోత్తం, కిషన్, ఆనంద్‌రావు, దానయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాద్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభను నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, వెట్టిచాకిరీ, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. నిజాం సర్కార్‌ను, రజాకార్ల జాగిర్దార్లను తరిమికొట్టేందు కు సాయుధ పోరాటం చేశారన్నారు. ఈ పోరాటంలో ఎంతోమంది కమ్యూనిస్టు యోధులు నేలకొరిగారని అన్నారు. వారి పోరాట ఫలితం వల్లే నిజా ం సర్కార్ హైదరాబాద్ సంస్థానాన్ని వదిలేసి వెళ్లిపోయారన్నారు. ప్రస్తుతం ప్రజా సమస్యల పరి ష్కారం, డిమాండ్‌ల సాధనే లక్ష్యంగా నాయకులు పోరాడాలన్నారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతా లు, నాయకులు.. రామస్వామి, షకీల్, గోవింద్‌నాయక్, వెంకటేశ్, జంగయ్య, చెన్నయ్య, చంద్రబాబు, లింగంనాయక్, మైసయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పాత్ర కీలకం..

హయత్‌నగర్: నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దోపిడీలకు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని.. పోరాటంలో కమ్యూనిస్టులు ముఖ్య పాత్ర పోషించారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వీరులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొయినుద్దీన్ చిత్రపటాలకు ఆయన నివాళి అర్పించారు. రంగారెడ్డి కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేణుగోపాలచారి, నాయకులు సైదులుముదిరాజ్, నవనీత, నారాయణరెడ్డి, సక్కునాయక్, నారాయణ, నిరంజన్, భూక్యాకాంతి, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

పరిగి: గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మిట్టకోడూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అర్జునయ్య (65) మంగళవారం గ్రామంలోని రావిచెట్టు కింద నిద్రిస్తున్నాడు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను డ్రైవర్ విష్ణు రివర్స్ తీస్తుండగా అర్జునయ్యపైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో అర్జునయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు హుటాహుటిన అతడిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అర్జునయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



మహిళా రోగులతో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. ఆరోగ్య మహిళా ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళారోగితో మాట్లాడారు. మహిళలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో లేని పరీక్షల కోసం రక్తనమూనాలను సేకరించి కొండాపూర్ ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రవంతి, తబస్సుమ్, ప్రవీణ, సంధ్య, కిరణ్మయి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, రమ, ఫార్మసిస్టు ఉదయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల వద్ద నిబంధనలు పాటించాలి

డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు టౌన్: వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో హిందూ ఉత్సవ కేంద్ర సమితి, వినాయక మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వినాయక మండపాలను ఏర్పాటు చేసేటప్పుడు పోలీసులు సూచించిన నిబంధనలను పాటించాలన్నారు. మండపాల వద్దకు అంబులెన్స్, పోలీసు జీపు తదితర వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా ఉండాలన్నారు. మండపాల వద్ద ఉత్సవ నిర్వాహకులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. సమితి అధ్యక్షురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.